సాక్షి
జనగామ

బుధవారం । 27 । డిసెంబర్ । 2023



రేపటి నుంచి ఐహెచ్‌సీ సెషన్
కేయూలో ఐహెచ్‌సీ 82వ సెషన్‌ను రేపటి (గురువారం) నుంచి నిర్వహించనున్నట్లు వీసీ రమేష్ తెలిపారు. - 8లో▸



అనంతమల్లయ్య శర్మ శివైక్యం..
ప్రముఖ సిద్ధాంతి అయినవోలు అనంతమల్లయ్య శర్మ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం శివైక్యం చెందారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
28^0/15^0

వాతావరణం
జిల్లాలో ఉదయం పొగమంచు పడుతుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రత ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కరోనా కేసు నమోదు

జనగామ రూరల్: జిల్లాలో కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తిచెందిన తర్వాత శనివారం ఒక కేసు నమోదు కాగా మంగళవారం మరో కేసు నమోదైంది. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 14 మందికి ర్యాపిడ్ పరీక్షలు చేయగా జనగామ పట్టణానికి చెందిన వ్యక్తికి కరోనా పాజిటివ్‌గా వచ్చినట్లు వైద్యులు వెల్లడించారు. వారం రోజుల్లో రెండు కేసులు నమోదు కావడంతో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అప్రమత్తం అయింది.

అక్షింతల పంపిణీ



పాలకుర్తి టౌన్: మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి శ్రీరామ పూజిత అక్షింతలు అందజేస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందాల చందర్ బాబు, ఉమ్మడి వరంగల్ విభాగ్ ప్రచారక్ విగ్నేష్‌జీ తెలిపారు. మంగళవారం పాలకుర్తిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జనవరి 2024న సోమవారం అయోధ్య శ్రీరామ జన్మభూమి నూతన రామాలయంలో గర్భగుడిలో శ్రీ బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ధర్మ జాగరణ సమితి, జనగామ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు చిదిరాల కృష్ణ మూర్తి, జిల్లా భౌధిక్ ఎర్రం రమేష్, మత్తగజం నాగరాజు శర్మ, గంగు నవీన్ శర్మ, వేల్పుల దేవరాజ్, గజ్జి సంతోష్ కుమార్, బైకాని నాగరాజు, పసులాది నాగరాజు పాల్గొన్నారు

సీపీఐ శ్రామికవర్గ పార్టీ



జనగామ రూరల్: శ్రామిక రక్తంలో నుంచి పుట్టి.. శ్రామిక వర్గం వైపు నిలబడిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి అన్నారు. మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల శ్రమ దోపిడీ నుంచి కార్మికుల రక్తం నుంచి పుట్టింది ఎర్రజెండా అని అన్నారు. అమరులైన కార్మికుల త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్, ఆది సామన్న, మంగళంపల్లి జనార్ధన్, చొప్పరి సోమయ్య, మధు, శ్రీశైలం, యాదగిరి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు



దేవరుప్పుల: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం అసిస్టెంట్ శ్రీరామ్‌రెడ్డి కృష్ణమూర్తి సౌజన్యంతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. శ్రీరామదాసు భజన మండలి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మాన్యపు సిద్దేశ్వర్ పర్యవేక్షణలో సింగరాజుపల్లిలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం శ్రీరామదాసు భజన మండలి 30 మంది జంటలు సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నాయి. భజన మండలి జిల్లా కోశాధికారి గందె లక్ష్మయ్య మంగళ హారతి సామగ్రి ఉచితంగా అందించారు. కార్యక్రమంలో పూలమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా..

జనగామ రూరల్: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున అన్నారు. మంగళవారం పట్టణంలో టీఎస్‌జీఆర్‌ఈఏ ఆధ్వర్యంలో పెన్షనర్ డే ఘనంగా నిర్వహించారు. మహేందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జమున మాట్లాడారు. సంఘం అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం హెల్త్ స్కీమ్‌లు అమలు చేయాలని పెండింగ్‌లో ఉన్న మూడు డీఆర్‌లు, పీఆర్సీలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, బాలయ్య, లక్ష్మయ్య, రాజేష్‌చంద్ర, మహబూబ్ రెడ్డి, జగదీశ్వరాచారి, శంకరయ్య, నరసింహారెడ్డి, జానీమియా, రామన్న యాదవరెడ్డి, శోభ, హేమలత, ఉమా, సువిత్ర, జమున పాల్గొన్నారు.

నేరగల్లు!

- వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో 7.71శాతం పెరిగిన క్రైం రేట్
- దొంగతనాలు 47.74శాతం, దోపిడీలు 25 శాతం..
- పోక్సో కేసులు 36.3 శాతం పెరుగుదల
- సైబర్ నేరాలు గత ఏడాదికంటే రెండింతలు..
- ప్రజాభద్రతపై సర్వత్రా ఆందోళన..
- నేర వార్షిక నివేదిక విడుదల చేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా
- వచ్చే ఏడాది ప్రణాళిక ప్రకారంతో నేరాలు తగ్గిస్తామని వెల్లడి





సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా



వరంగల్ క్రైం:

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాలు గతేడాదికంటే ఈ ఏడాది 7.71 శాతం పెరిగాయి. గత ఏడాది అన్ని కేసులు కలిపి 13.489 నమోదుకాగా, ఈ ఏడాది 14,530 కేసులు నమోదుచేశారు. ప్రజలు, మహిళల భద్రత విషయంలో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోంది. పోలీస్ అధికారులు మాటల్లో చెప్పినంతగా చేతల్లో చూపెట్టలేదనే అభిప్రాయం నేరాల గణాంకాలు చూస్తే తేటతెల్లమైంది. గత ఏడాది కంటే ఈసారి మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు 36.3 శాతం పెరగడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం కమిషనరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ ఏడాదికి సంబంధించి క్రైం వార్షిక నివేదికను విడుదల చేశారు. అధికారిక లెక్కల ప్రకారం అన్ని విభాగాల్లో కలుపుకుని 7.71 శాతం క్రైం రేట్ పెరిగిందని సీపీ ప్రకటించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని చాలా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో అధికారులు భూముల సెటిల్‌మెంట్లకు కేటాయించిన సమయంలో ప్రజల భద్రతకు ఇవ్వడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల్లో 108 కేసులు నమోదు...

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కమిషనరేట్ పరిధిలోని 6 నియోజకవర్గాలు, 5 పాక్షిక నియోజకవర్గాల్లో నిబంధనలు అతిక్రమించిన వారిపై 108 కేసులు నమోదు చేశారు. ఉచితాలకు సంబంధించి **26 కేసులు** నమోదు కాగా, వాటి విలువ రూ.15,52,594, నగదువి 270 కేసులు నమోదు చేసి రూ. 6,15,54,649 డబ్బు స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా 2,448 లీటర్లు (విలువ రూ 8,89,300), మద్యం 5,550 లీటర్లు (విలువ రూ.35,78,484), రూ.10లక్షల విలువ గల బెల్లం, పటికలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 7.863 కిలోల బంగారం (విలువ రూ.73,73,98,083) సీజ్ చేశారు. 7,863 మందిని బైండోవర్ చేశారు.

అంతర్‌రాష్ట్ర ముఠాల అరెస్టు..



వివిధ రాష్ట్రాలకు చెందిన దొంగల ముఠాలు కమిషనరేట్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన పట్టుబడ్డాయి. వాటిలో ఆంధ్రప్రదేశ్ ముఠా ఒకటి, మహారాష్ట్ర 2, మధ్యప్రదేశ్ 1, రాజస్తాన్ 2, ఉత్తర ప్రదేశ్ 1, తమిళనాడు 1 ఉన్నాయి. ఆయా ముఠాల్లోని 21 మంది నుంచి రూ.58,62,318 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పెరిగిన హత్యలు..అత్యాచారాలు..



కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది హత్యలు, అత్యాచారాలు భారీగా పెరిగాయి. హత్యలు 44 (7.31 శాతం), అత్యాచారాలు 184 (36.29 శాతం), మహిళలపై నేరాలు 1,705 (18 శాతం) పెరగగా ఎస్సీ, ఎస్టీలపై 2.28 శాతం నేరాలు తగ్గాయి. వివిధ కేసుల్లో సంబంధం ఉన్న నిందితులకు 9మందికి జీవిత ఖైదు, ఇద్దరికి 10 సంవత్సరాలకుపైన, 15 మందికి 3 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాల లోపు, 121 మందికి 3 సంవత్సరాలు శిక్ష పడింది.

18 మందిపై పీడీ యాక్టు



తరచూ నేరాలకు పాల్పడుతున్న 18 మందిపై పీడీ యాక్టు నమోదు చేశారు. ఇందులో హత్యలకు పాల్పడిన వారిలో ఒకరు, దోపిడీదారులు ఇద్దరు, ఒక దొంగ, మోసాలకు పాల్పడిన ఆరుగురు, డ్రగ్స్ సరఫరా చేసిన ఐదుగురు, భూఆక్రమణలు, పీడీఎస్ రైస్‌దందాలో ముగ్గురు ఉన్నారు.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు....



అతివేగం, నిర్లక్ష్యం కారణంగా జరిగిన 450 రోడ్డు ప్రమాదాల్లో 487 మంది మరణించగా , సాధారణ రోడ్డు ప్రమాదాలు 838తో 1,361 మంది గాయపడ్డారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై పోలీస్ అధికారులు డ్రంకెన్‌డ్రైవ్‌లో 14,845 కేసులు, ఈ చలానా 6,26,142, స్పీడ్ గన్ 58,082, కేసులు నమోదు చేశారు. 15,777 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

చీకటి వ్యాపారంపై పంజా



వరంగల్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న చీకటి వ్యాపారంపై పోలీస్ అధికారులు ఉక్కుపాదం మోపారు. 73 కేసుల్లో 1,693 కిలోల (విలువ రూ.3.36 కోట్లు) గంజాయి పట్టుకున్నారు. 274 గుడుంబా కేసులను నమోదు చేసి రూ.12.66 లక్షల విలువ గల 5006 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. రూ.50.12 లక్షల విలువ గల 5,025 లీటర్ల అక్రమ మద్యం పట్టుకున్నారు. రూ.25.49 లక్షల విలువ గల 2,549 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్ చేశారు. రూ.50.05 లక్షల విలువగల 224 ఇసుక లారీలను పట్టుకున్నారు. సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు 124 కేసుల్లో 54 మందిని అరెస్టు చేసి రూ.36,37,077 స్వాధీనం చేసుకున్నారు.

సైబర్ నేరాలు...



కేసులు	2021	2022	2023
ఆర్థిక సంబంధిత	150	553	1,027
ఆర్థికేతర	0	78	68
మొత్తం	150	631	1,095

గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం : సీపీ అంబర్ కిషోర్ ఝా



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎక్కడ గంజాయి, డ్రగ్స్ మాట వినిపించకుండా ఉక్కుపాదం మోపుతాం. రాష్ట్రప్రభుత్వం కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కమిషనరేట్‌లో ఈ ఏడాది మహిళలపై దాడులు పెరిగాయి. ఇది చాలా బాధాకరం. వచ్చే సంవత్సరం ప్రణాళికతో కేసుల సంఖ్య తగ్గిస్తాం. ప్రజల్లో అవగాహన పెరగడం వల్ల పోలీస్‌స్టేషన్‌లకు వచ్చి ఫిర్యాదు చేశారు. దీంతో కేసులు పెరిగాయి. అక్రమార్కుల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం.

వివిధ రకాల ఆర్థిక నేరాలు ఇలా...(సొత్తు రూ.కోట్లలో)



	దోపిడీలు	పగలు దొంగతనం	రాత్రి దొంగతనం	సాధారణ దొంగతనం	ఆటోమొబైల్స్ దొంగతనం
కేసులు	20	79	249	320	230
పట్టుబడినవి	19	47	118	198	104
కోల్పోయిన సొత్తు	0.19	1.84	3.98	2.41	1.55
రికవరీ సొత్తు	0.02	0.97	0.95	0.87	0.85
రికవరీ శాతం	15	53	24	36	55

పెరిగిన నేరాలు...

క్రైమ్ హెడ్	2021	2022	2023	పెరుగుదల
లాభం కోసం హత్య	1	1	1	100 శాతం
దోపిడీలు	28	16	20	25 శాతం
దొంగతనాలు	199	222	328	47.74 శాతం
హత్యలు	53	41	44	7.3 శాతం
పోక్సో కేసులు	96	135	184	36.3 శాతం
మోసాలు	741	1,500	1,994	33 శాతం
డెకాయిట్	2	3	2	33శాతం తగ్గుదల

నియోజకవర్గ అభివృద్ధికి కృషి..

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని శివునిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఘన్‌పూర్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరుత్సాహ పరిచినా ఘన్‌పూర్‌లో గెలుపు ఆత్మస్థైర్యాన్ని ఇచ్చిందన్నారు. దేవాదుల రిజర్వాయర్ కింద ఉన్న కాల్వల మరమ్మతు చేయించి ఏడాదిలోపు ప్రతీ గ్రామానికి గోదావరి జలాలు అందిస్తానన్నారు. సంక్రాంతి లోపు అన్ని శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించి సమస్యలు పరిష్కరించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులను కొనసాగించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ది లేకుండా అధికారమే లక్ష్యంగా ఇష్టారాజ్యంగా అమలుకు వీలుగాని హామీలు ఇచ్చిందని విమర్శించారు. హామీలు అమలు చేయలేక శ్వేతపత్రం అంటూ కాలయాపన చేస్తున్నారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని చెప్పడం కాదని, ఆ అప్పులు తెలంగాణ ప్రజల సంక్షేమ పథకాలను వినియోగించారని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా.. ఇకపై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తనతో ఫ్రీగా ఉండాలని, సార్.. అని కాకుండా శ్రీహరి అన్నా అని ఆప్యాయంగా పిలువాలని కోరారు. సంక్రాంతి తర్వాత క్యాంపు ఆఫీసును స్టేషన్‌ఘన్‌పూర్‌కు మార్చుకుంటానని, ఏ సమస్య అయినా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకన్న, చిల్పూరు దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎంపీపీలు కందుల రేఖ, బొమ్మిశెట్టి సరిత, సారంగపాణి, శంకర్, గట్టయ్య, వినోద్, ఎంపీటీసీలు లతాశంకర్, రాజు, నర్సింహులు, రజాక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి సైన్స్ ప్రాక్టికల్స్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్య కేంద్రంలో ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ప్రాక్టికల్స్ ఈనెల 29 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు. ఈనెల 29, 30 తేదీల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రప్రజల ఆకాంక్షను నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సీపీఎం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను నెరవేర్చేలా నూతన ప్రభుత్వం పనిచేయాలన్నారు. ఆరు గ్యారంటీలను పారదర్శకంగా, సమగ్రంగా అమలు చేయాలని, ప్రజాస్వామ్యబద్ధమైన పాలన సాగాలని ఆయన కోరారు. ఓట్లు, సీట్లతో పనిలేకుండా సీపీఎం నిరంతరం ప్రజల పక్షపాతిగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మునిగెల రమేష్, నాయకులు కొడెపాక యాకయ్య, చిలుముల్ల భాస్కర్, రాములమ్మ, కుర్ర ఉప్పలయ్య, మంద మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- జిల్లా వైద్యాధికారి ప్రశాంత్

బచ్చన్నపేట: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి ప్రశాంత్ అన్నారు. మండలకేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి ఆస్పత్రి పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించాలని ఏఎన్‌ఎంలు, ఆశాలు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించి మందులు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి, సిద్ది సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ప్రశాంత్

‘ప్రజా పాలన’తో పేదల సంక్షేమం

- 28నుంచి వార్డు, గ్రామసభలు.. జనవరి 6వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నాం.
- అధికారులకు పనిచేసే స్వేచ్ఛ కల్పించాం
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష
- పాల్గొన్న మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు



సమీక్షలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మంత్రులు సురేఖ, సీతక్క, విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు తదితరులు

హన్మకొండ అర్బన్: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేవిధంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అ దిశగా అధికారులు ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో ప్రజాపాలన కార్యక్రమ విధివిధానాలు, నిర్వహణ తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో కట్టుదిట్టంగా ప్రజాపాలన సభలు నిర్వహించాలన్నారు. ప్రజల నుంచి మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహలక్ష్మి, చేయూత పథకాలకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రతి దరఖాస్తుదారుడికి 4 నుంచి 5 నిమిషాల సమయం కేటాయించాలని, అతనికి ఒక్క రూపాయి ఖర్చు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పథకాల దరఖాస్తు ఫారాలు ఒకరోజు ముందుగానే గ్రామాలకు వస్తాయని, ప్రజలకు వాటిని అందించి వారు నింపుకుని గ్రామ సభకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిరక్షరాస్యులకు దరఖాస్తులు నింపడంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు సహకరించాలన్నారు. గ్రామసభ నిర్వహణకు షెడ్యూల్ అందిస్తారని, మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించుకుని తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సభ ఎప్పుడు నిర్వహిస్తున్నామనేది ప్రజలకు ముందుగానే తెలిసేలా స్థానిక సిబ్బందితో ప్రచారం నిర్వహించాలని సూచించారు.



సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు

దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలి: మంత్రి కొండా సురేఖ

ప్రజలనుంచి అధికారులకు అందిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఉంటే కలెక్టర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. అధికారులు, ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రతి దరఖాస్తు పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నారు.

మండలానికి రెండు బృందాలు : కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి మండలానికి తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు క్షేత్రస్థాయిలో ఉంటూ గ్రామాలు, డివిజన్లలో దరఖాస్తులు స్వీకరించేలా చేస్తున్నామన్నారు. ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఉండేలా చూస్తామన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్ రామ్‌చంద్రునాయక్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మురళీనాయక్, పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా, వరంగల్, మహబూబాబాద్ కలెక్టర్లు ప్రావీణ్య, శశాంక, ఐటీడీఏ పీఓ అంకిత్, గ్రేటర్ కమిషనర్ రిజ్వాన్ బాషా, మహబూబాబాద్ ఎస్పీ సంగ్రాంసింగ్ జీ పాటిల్, అదనపు కలెక్టర్లు శ్రీజ, అశ్విని తానాజీ వాకడే, పింకేష్ కుమార్, వెంకటేశ్వర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాచరిక పాలననుంచి... ఇందిరమ్మ రాజ్యం వైపు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజలు రాచరిక పాలననుంచి ఇందిరమ్మరాజ్యం రావాలని కోరుకుని తీర్పు చెప్పారని, వారి అభీష్టానికి అనుగుణంగా ప్రజాపాలన సాగిస్తామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల్లో ముంచారని అన్నారు. 24గంటల కరెంటు కాంగ్రెస్ ఇవ్వదని, ధరణి బంగాళాఖాతంలో కలుపుతారని చెప్పినా ప్రజలు ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన కోరుకున్నారన్నారు. ధరణి పేరుతో, ఇతర రకాలుగా ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వాటిని తిరిగి తీసుకుంటామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో మాట్లాడాలని మైక్ ఇస్తే మాట్లాడకుండా బయటికి వెళ్లి స్వేదపత్రాలు విడుదల చేస్తే ప్రజలు నమ్మబోరన్నారు. అప్పులతో ఆస్తులు కూడబెట్టామని చెబుతున్న వారి ఆస్తుల్లోని కాళేశ్వరంలోని ఒక బ్యారేజ్ మూడు మీటర్లు కుంగిందని, మరో రెండు బ్యారేజీలు పనికిరాకుండా ఉన్నాయని తెలిపా రు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అధికారపార్టీతో పాటు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు కూడా ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు ఆరు గ్యారంటీలు అందేవిధంగా చూడాలన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ గత ప్రభుత్వ నేతలు విడుదల చేస్తున్నవి స్వేద పత్రాలు కావని స్వార్థ పత్రాలని అన్నారు. ప్రజాపాలన మొదలై వారం కాకుండానే విమర్శలకు దిగడం వారి దిగజారుడు తనమన్నారు.

క్లుప్తంగా

ఉమెన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

వరంగల్: ఉమెన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బాల్నే శ్రీనివాసరావును నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షురాలు సన్నీ షా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రాక్టర్ పల్టీ.. రోటవేటర్ మీద పడి రైతు మృతి

- నారుమడి దున్నేందుకు వెళ్తుండగా ఘటన..




బిచ్యానాయక్(ఫైల్)

కేసముద్రం: నారుమడి దున్నేందుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ వెనక్కి పల్టీ కొట్టడంతో రొటవేటర్ మీద పడి ఓ రైతు మృతిచెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలోని లాలుతండా జీపీ శివారు రాముతండాలో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్సై క్రిష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం..తండాకు చెందిన భుక్యా బిచ్యానాయక్(50) అనే రైతు, తన పంటభూమిలో నారుమడి దున్నేందుకుగాను, ఇదే తండాకు చెందిన ట్రాక్టర్ యజమాని లకావత్ శ్రీనివాస్‌ను సంప్రదించాడు. శ్రీనివాస్ తన ట్రాక్టర్‌పై బిచ్యానాయక్‌ను ఎక్కించుకుని, పంటపొలానికి బయలుదేరారు. రెడ్డిగూడెంకుంట కట్ట ఎక్కుతుండగా, ఒక్కసారిగా ట్రాక్టర్ ముందు చక్రాలు పైకి లేవడంతో ట్రాక్టర్ వెనకకు పల్టీ కొట్టింది. అప్పటికే డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాస్ అప్రమత్తమై పక్కకు దూకగా, బిచ్యానాయక్ దూకే ప్రయత్నం చేసినప్పటికి కిందపడటంతో, అతడి మీద ట్రాక్టర్‌కు అమర్చిన రోటవేటర్ పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు 108లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. డ్రైవర్ శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బిచ్యానాయక్ గతంలో ఇనుగుర్తి ఉమ్మడి జీపీలో వార్డుసభ్యుడిగా పనిచేశాడు. 2014లో అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో నిలిచాడు. మృతుడికి భార్య సరోజ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.


రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

అనంతమల్లయ్య శర్మ శివైక్యం..

- శ్రీశ్వేతార్క ఆలయ వ్యవస్థాపకుడి కన్నుమూత
- శోకసంద్రంలో కుటుంబికులు, భక్తులు
- నేడు కాజీపేటలో అంత్యక్రియలు


అనంతమల్లయ్య శర్మ (ఫైల్)

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్రీశ్వేతార్కమూల గణపతి దివ్య క్షేత్రం వ్యవస్థాపకుడు అయినవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి (60) శివైక్యం చెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం తుది శ్వాస విడిచారు. గతంలోనూ పలుమార్లు తీవ్ర అస్వస్థతకు గురైనా కొలుకున్నారు. కాగా, రెండు తెలుగు రాష్ట్రాలకు సుపరిచితుడైన మల్లయ్య శర్మ సిద్ధాంతి శివైక్యం చెందారనే విషయం తెలియడంతో ప్రజలు, భక్తులు విషాదంలో మునిగారు. కొంత మంది ఆలయానికి చేరుకుని బోరున విలపించారు.

30 ఏళ్లుగా శ్వేతార్కుడికి సేవలు..

మూడు దశాబ్దాల క్రితం దాతల చేయూతతో పట్టుదలగా ఒకే ప్రాంగణంలో శ్వేతార్కుడితో పాటు 29 దేవతామూర్తులకు పలు ఆలయాలు నిర్మించారు. నల్లగొండ జిల్లాలో తెల్ల జిల్లేడు చెట్టు వేరు నుంచి ఉద్భవించిన శ్వేతార్కుడి ఆకారాన్ని ఇక్కడికి తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. 30 సంవత్సరాలుగా అన్ని పర్వదినాల్లో ప్రత్యేక ఉత్సవాలు, పూజలు నిర్వహిస్తున్నారు.

నాస్తికత్వం నుంచి ఆధ్యాత్మికం వైపు..

60 ఏళ్ల క్రితం కాజీపేట పట్టణంలో పుష్పలత, వెంకటేశ్వర్లు శర్మ దంపతులకు అనంతమల్లయ్య శర్మ జన్మించారు. తండ్రి అప్పటికే ప్రముఖ పురోహితుడైనప్పటికీ అనంతమల్లయ్య మాత్రం నాస్తికుడిగా మారాడు, ఎంఏ తెలుగు, పీజీ జర్నలిజం చేసి రచయితగా, విమర్శకుడిగా, నాస్తికుడిగా పేరొందారు. కొడుకును మార్చడానికి తండ్రి వెంకటేశ్వర్లు శర్మ ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. నాస్తికుడిగా మారిన అనంతమల్లయ్యకు 1987లో గణనాథుడు కలలో కనిపించాడు. దీంతో దైవభక్తి పెరిగి ఆ దిశగా అడుగులు వేశాడు. 1998లో శ్వేతార్కుడు కలలో కనిపించడంతో జిల్లేడు చెట్టులో ఉద్భవించిన గణపతిని ఆకారాన్ని సేకరించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో పాటు ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం అందిస్తుండడంతో నాలుగు అంతస్తుల్లో 29 దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించి నిత్యం పూజలు చేయిస్తున్నారు. ఆలయంలో నిత్య కైంకర్యాలు, పాలన విధానాలను ఇద్దరు కుమారులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మకు అప్పగించారు.

పూర్తిగా ఆధ్యాత్మికం వైపు అడుగులు..

నాస్తికుడిగా జీవిత ప్రయాణం మొదలు పెట్టిన అనంతమల్లయ్య శర్మ ఆస్తికుడిగా మారిన తర్వాత పూర్తిగా ఆధ్యాత్మికం వైపు అడుగులు వేశాడు. భద్రకాళి ఆలయ ఆస్థాన పండితుడిగా, తొగుట పీఠం ఆస్థాన పండితుడిగా నేటికీ కొనసాగుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పండితులు ఏర్పాటు చేసుకున్న విద్వత్ సభ ఉపాధ్యక్షుడిగా ఉంటూ విశేష సేవలు అందిస్తున్నారు. పంచాంగ రూపకల్పనలోనూ పాలుపంచుకుంటున్నారు.

నేడు కాజీపేటలో అంత్యక్రియలు..

కాజీపేట పట్టణంలో బుధవారం అనంతమల్లయ్య శర్మ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కడసారి చూపు కోసం భక్తులు, శ్రేయోభిలాషులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యకర్తలు కృషి చేస్తున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, అడిషనల్ డీసీపీ బెదరకోట జనార్దన్, డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతో పాటు పలువురు సంతాపం ప్రకటించారు.

ఆశయంతో పనిచేస్తే అద్భుతాలు

- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క


మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

కొత్తగూడ: అధికారులు ఆశయంతో పని చేస్తే అద్భుతాలు సృష్టించొచ్చని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన అధికారుల సమీక్షలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోనే వెనుకబడి ప్రాంతమైన కొత్తగూడలో అధికారులు సేవాభావంతో పని చేయాలన్నారు. ఇప్పటి వరకు మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పని చేయని కాంట్రాక్టర్ల కాంట్రాక్ట్ రద్దు చేసి నూతన వ్యక్తులకు ఇవ్వాలన్నారు. పూర్తయిన పనులకు బిల్లులు ఆగకుండా చూసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. పనులు నాణ్యతగా చేపట్టాలని, నాసిరకంగా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా మంజూరైన పనులు, ఇంకా మంజూరు కావాల్సిన పనుల వివరాలు తెలుసుకున్నారు. కొన్ని పనులకు ఫారెస్ట్ అనుమతులు త్వరగా వచ్చేలా చూడాలని కలెక్టర్ శశాంకకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే పౌష్టికాహార విషయంలో ఇంకా ఏమైనా సూచనలు చేయాలని కోరారు. ఈనెల 28 నుంచి జరిగే ప్రజాపాలన గ్రామ సభలకు ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సమీక్షలో మానుకోట ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌పాటిల్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని గుంజేడు నుంచి చిట్యాలగడ్డ, వేలుబెల్లి నుంచి చింతగట్టుతండా, గోవిందాపూర్ నుంచి పొగుళ్లపల్లి, కొత్తపల్లి ఎక్స్ రోడ్డు నుంచి ఓటాయి ఎక్స్ రోడ్డు వరకు డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మండలకేంద్రంలో పీఆర్ ఇంజనీరింగ్ ఆఫీస్‌ను ప్రారంభించారు.

గిరిజన, గిరిజనేతరులకు పోడు పట్టాలు..

గిరిజన, గిరిజనేతరుల పోడు భూములకు పట్టాలు వచ్చేలా కృషి చేస్తానని మంత్రి సీతక్క అన్నారు. మండలకేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇక్కడి సమస్యలు అన్ని తనకు తెలిసినవేనని, క్రమ క్రమంగా పరిష్కరిస్తామన్నారు. అనంతరం మండలంలోని మోకాళ్లపల్లిలో నిర్మించిన ఆదివాసీ లిబరేషన్ టైగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుంజ రాము స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ విజయ, జెడ్పీటీసీ పుష్పలత, సర్పంచ్‌లు మల్లెల రణధీర్, గుగులోత్ రజిత, ఎంపీటీసీలు హలావత్ సాలూకి, పుష్పలత, జంపయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు వజ్జ సారయ్య, చల్లా నారాయణరెడ్డి, మొగిళి, రూప్‌సింగ్, జాడి వెంకటేశ్వర్లు, కక్ర జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత బాలికను ఆస్పత్రికి తరలించిన మంత్రి సీతక్క


బాలికను అంబులెన్స్‌లో తరలిస్తున్న మంత్రి

కొత్తగూడ : చలి కాగుతున్న సమయంలో మంటల్లో పడడంతో తీవ్ర గాయాలపాలైన కొత్తగూడ మండలం బక్కచింతలపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగ బాలిక రజితను మంత్రి సీతక్క మంగళవారం ప్రత్యేక అంబులెన్స్‌లో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. బాలికకు నాణ్యమైన వైద్యం అందించాలని సంబంధిత ఆసుపత్రి వర్గాలతో మాట్లాడారు. కాగా, బాధిత బాలికకు గంగారం మండలం కోదండరామాలయ కమిటీ సభ్యులు రూ. 30 వేలు, నర్సంపేటలోని శ్రీ శుభమస్తు షాపింగ్ మాల్ యాజమాన్యం రూ. 30వేలు, ములుగుకు చెందిన దాతలు రూ. 40వేలు, స్థానిక దాతలు రూ. 30వేల ఆర్థిక సాయం అందజేశారు.

అప్పల బాధతో వార్డు సభ్యుడి ఆత్మహత్య


మధు(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: అప్పుల బాధ తాళలేక మండలంలోని మీదికొండకు చెందిన ఐదో వార్డు సభ్యుడు శివరాత్రి మధు (38) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మధుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పులు విరివిగా కావడంతో ఏడాది క్రితం భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ కూలీ చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం(ఈనెల 25వ తేదీ) తన పెద్ద కుమారుడితో కలిసి మీదికొండకు వచ్చాడు. మంగళవారం ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగారు. తండ్రి చేరాలు వ్యవసాయ బావి వద్దకు వెళ్లే సరికి మధు అపస్మారక స్థితిలో ఉన్నాడు. దీంతో 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సట్ల రాజు తెలిపారు.

'కల్యాణలక్ష్మి' ఆడపడుచులకు వరం

- రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ


లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న మంత్రి సురేఖ

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడపడుచులకు వరమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం వరంగల్ అబ్నూస్ ఫంక్షన్ హాల్‌లో తూర్పు నియోజకవర్గంలోని వివిధ డివిజన్లకు చెందిన 278మంది లబ్ధిదారులకు రూ.2.78 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆడపిల్ల పెళ్లిళ్లకు మేమున్నామని భరోసా ఇస్తూ ప్రభుత్వం ముందుకు రావడం శుభపరిణామమని, గతంలో ఆడపిల్ల పెళ్లి చేయాలంటే అప్పు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, ఆడపిల్లల తల్లిదండ్రుల భరోసాతో జీవించొచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న చెక్కులు వీలైనంత త్వరలో మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం 6 గ్యారంటీల అమలు కార్యక్రమం వేగంగా చేపడుతున్నామన్నారు. ఇందులోభాగంగా ఈనెల 28 నుంచి జనవరి 6 వ తేదీ వరకు గ్రామాల్లో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. ఇందులో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిబంధనల మేరకు ప్రభుత్వ పథకాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, సురేష్‌జోషి, మరుపల్ల రవి, పోశాల పద్మ, గుండు చందన, కావేటి కవిత, చింతాకుల అనిల్, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కువైట్ వెళ్తుండగా సముద్రంలో ములుగు జిల్లావాసి గల్లంతు


తల్లిదండ్రులతో గుర్రం శ్రీమాన్ (గ్రీన్ కలర్ జాకెట్ వేసుకున్న వ్యక్తి)


అడిషనల్ కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందజేస్తున్న తండ్రి గుర్రం సమ్మిరెడ్డి

- మా కొడుకు ఆచూకీ తెలపండని అదనపు కలెక్టర్‌కు తల్లిదండ్రుల వేడుకోలు

ఎస్ఎస్ తాడ్వాయి: ఇరాన్‌నుంచి కువైట్ వెళ్తున్న షిప్‌లోనుంచి ప్రమాదవశాత్తు సముద్రంలో గల్లంతైన తమ కుమారుడి ఆచూకీ తెలిపేందుకు సహకరించాలని కోరుతూ ఓ తల్లిదండ్రులు ములుగు అదనపు కలెక్టర్ శ్రీజకు మొరపెట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం బయ్యక్కపేట గ్రామానికి చెందిన సర్పంచ్ గుర్రం రమ – సమ్మిరెడ్డి కుమారుడు శ్రీమాన్ జైపూర్ హెడ్‌క్వార్టర్స్‌గా నడిచే రుద్రాక్ష కన్సల్టెంట్ కంపెనీ తరఫున నవంబర్ 22న ఇరాన్ వెళ్లాడు. అక్కడినుంచి ట్రాన్స్‌పోర్ట్ షిప్ ద్వారా కువైట్‌కు వెళ్తుండగా ఈనెల 25న మార్గ మధ్యలో సముద్రంలో గల్లంతు అయినట్లు తమకు సమాచారం అందించారని తల్లిదండ్రులు తెలిపారు. అదే షిప్‌లో ఉన్న మరో వ్యక్తి మృతదేహం లభ్యమైందని తెలిసిందన్నారు. కానీ ఇప్పటివరకు తమ కుమారుడి ఆచూకీ తెలియరాలేదని, సంస్థ వారిని సంప్రదించగా రెస్క్యూ టీంలు సముద్రంలో వెతుకుతున్నాయని, ఇంకా ఎలాంటి సమాచారమూ రాలేదని తెలిపారన్నారు. తమ కుమారుడి ఆచూకీ కోసం తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు రమ, సమ్మిరెడ్డిలు మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీజను కలిసి వినతిపత్రం సమర్పించారు.

వైభవంగా గోదావరి హారతి

- పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు


గోదావరి నదికి హారతి ఇస్తున్న అర్చకులు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కాళేశ్వరముక్తీశ్వర స్వామి ఆలయ అధికారులు, అర్చకుల ఆధ్వర్యంలో మంగళవారం త్రివేణి సంగమ గోదావరి నదికి హారతి నిర్వహించారు. ఆలయం నుంచి మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కాలినడక గోదావరి నదికి భక్తులతో తరలి వెళ్లారు. అక్కడ గోదావరి తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, చీర, సారే, పాలు, పండ్లు, పసుపు, కుంకుమ, పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అర్చకులు గోదావరి నదికి హారతి నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ మహేష్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, సిద్ధాంతి భానుప్రకాశ్, శ్యాంసుందర్, పద్మ పాల్గొన్నారు.

కేయూలో 28 నుంచి ఐహెచ్‌సీ సెషన్

- వీసీ తాటికొండ రమేష్


మాట్లాడుతున్న వీసీ తాటికొండ రమేష్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్(ఐహెచ్‌సీ) 82వ సెషన్‌ను ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించబోతున్నామని, అందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వీసీ తాటికొండ రమేష్ వెల్లడించారు. మంగళవారం కేయూలోని పరిపాలనాభవనం సెనేట్‌హాల్‌లో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ సయ్యద్ అలీనదీమ్ రిజావితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్.. భారతదేశంలో మాత్రమే కాదు దక్షిణాసియాలోని వృత్తిపరమైన చరిత్రకారుల అతిపెద్ద సంస్థ అని తెలిపారు. ఇందులో భారత ఉపఖండంలో 35వేల మంది చరిత్రకారులు, చరిత్రబోధకులు సభ్యత్వం కలిగి ఉందన్నారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ శాస్త్రీయ, లౌకిక చరిత్రను ప్రోత్సహిస్తుందని, ఇది ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య సంబంధాల కోసం నిలబడుతుందన్నారు. కేయూ చరిత్రలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్ నిర్వహించబోతుండం రెండోసారి అని తెలిపారు. గతంలో 1993లో నిర్వహించారని, ఇప్పుడు తన హయాంలో జరగడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సెషన్‌కు మూడురోజులలో ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక భారత దేశం అంశాలతోపాటు ఆర్కియాలజీ, సమకాలీన భారతీయ చరిత్ర ,భారతదేశం కాకుండా ఇతర దేశాల చరిత్ర వంటి 6 విభాగాలల్లో పరిశోధనా పత్రాల సమర్పణ ఉంటుందన్నారు. ఆరు విభాగాలల్లో సమర్పించేందుకు 1030 పరిశోధనా పత్రాలు వచ్చాయనితెలిపారు.

కార్యక్రమ ప్రారంభవం సందర్భంగా అవార్డులు అందజేత

ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ (ఐహెచ్‌సీ) 1935–1936లో అలహాబాద్ కేంద్రంగా స్థాపించారని ఐహెచ్‌సీ జనరల్‌సెక్రటరీ ప్రొఫెసర్ సయ్యద్ అలీ నదీమ్ రిజావి తెలిపారు. తొలిసెషన్ పూణెలో జరిగిందన్నారు. అప్పటి నుంచి మూడు సంవత్సరాలు మినహా క్రమంతప్పకుండా డిసెంబర్‌లో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ నిర్వహిస్తున్నామన్నారు. 1993లో కేయూలో అప్పటి వీసీ జయశంకర్ నాయకత్వంలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను నిర్వహించామని గుర్తుచేశారు. ఈ సంస్థ గతం నుంచి ప్రాథమిక రికార్డుల ఆధారంగా వాస్తవ ఆధారిత చరిత్రకోసం ప్రయత్నిస్తుందన్నారు. కాగా, ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అనేక అవార్డులు, బహుమతులు కూడా అందజేస్తామని వెల్లడించారు. కాగా, ఈనెల 28న నిర్వహించనున్న ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సెషన్ ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ పార్మర్ డైరెక్టర్ మృధుల ముఖర్జీ హాజరుకానున్నారు. అలాగే, 29న ముగింపు సెషన్‌లో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరవుతారు. రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, ఐహెచ్‌సీ లోకల్ సెక్రటరీ మనోహర్, కేయూహిస్టరీ విభాగం రిటైర్డ్ ఆచార్యుడు శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. హసన్‌పర్తి మండలం బాహుపేట క్రాస్ వద్ద బస్సు ఢీకొనడంతో అన్నదమ్ములు, హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో బైక్ అదుపు తప్పడంతో వృద్ధుడు, ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం కొండాపురం సమీపంలో బొలెరో ఢీకొనడంతో ప్రభుత్వ ఉద్యోగి, వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మహేశ్వరంలో పంచాయతీ కార్యదర్శి మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.


సోమయ్య (ఫైల్)


సుదర్శన్ (ఫైల్)


రాజిరెడ్డి మృతదేహం


సోడి శ్రీనివాస్ మృతదేహం


శ్రీనివాస్ (ఫైల్)

- అంత్యక్రియలకు వెళ్లొస్తూ.. అనంతలోకాలకు..

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ.. అన్నదమ్ముల మృతి

హసన్‌పర్తి : తమ సమీప బంధువు అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో బస్సు ఢీకొనగా అన్నదమ్ములు మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిలోని బాహుపేట క్రాస్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన బొడ్డు సోమయ్య(55), సుదర్శన్(58) అన్నదమ్ములు. ఈ క్రమంలో ఎల్కతుర్తి మండలం బాహుపేటలో తమ బంధువు మృతి చెందగా అంత్యక్రియలకు హాజరయ్యారు. అనంతరం బైక్‌పై బాహుపేట నుంచి ధర్మసాగర్‌కు పయనమయ్యారు. అయితే బాహుపేట క్రాస్ వద్దకు రాగానే, వెనుక వైపు నుంచి వస్తున్న సిరిసిల్ల డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో అన్నదమ్ములను తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. సోమయ్యకు భార్య శోభ, ఇద్దరు కుమారులు, కూతురు, సుదర్శన్‌కు భార్య యాదమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కాగా, చావులోనూ సోదరుల బంధం వీడలేదు. ఈ ఘటనపై మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తుమ్మ గోపీ తెలిపారు.

ధర్మసాగర్‌లో విషాదం..

అన్నదమ్ముల మృతితో ధర్మసాగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఎంజీఎం ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు.

కొత్తకొండలో వ్యక్తి..

ఎల్కతుర్తి: బైక్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం మంగళవారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో జరిగింది. గ్రామానికి చెందిన గడ్డం రాజిరెడ్డి(54) చంటయ్యపల్లెకు చెందిన తన అల్లుడు కాయిత సతీష్‌తో కలిసి బైక్‌పై కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లిలో తమ బంధువు దశదిన కర్మకు హాజరయ్యారు. తిరిగి స్వగ్రామం వస్తున్న క్రమంలో కొత్తకొండ సబ్‌స్టేషన్ దగ్గర బైక్ అదుపు తప్పి కిందపడింది. దీంతో బైక్ వెనుక కూర్చున్న రాజిరెడ్డికి తీవ్రగాయాలు కావడంతో 108లో ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపారు.

కొండాపురంలో ప్రభుత్వ ఉద్యోగి..

వెంకటాపురం(కె): మండలంలోని కొండాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సి కొత్తూరు గ్రామానికి చెందిన సోడి శ్రీనివాస్ (50)భద్రాచలం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శ్రీనివాస్.. సోమవారం పని నిమిత్తం కొండాపురం సమీపంలో బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో చర్ల వైపు నుంచి వస్తున్న బొలెరో ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలుకావడంతో భద్రాచలంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

మహేశ్వరంలో జీపీ కార్యదర్శి..

నర్సంపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మృతి చెందారు. ఈ ఘటన నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణానికి చెందిన రామగిరి శ్రీనివాస్ (52) మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తీగలవేణి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వరంగల్‌కు వెళ్లి తిరిగి రాత్రి సమయంలో నర్సంపేటకు బయలుదేరి వస్తున్నాడు. ఈ క్రమంలో నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ శివారులోని సెంటిమేరీ పాఠశాల సమీపంలోని నర్సంపేట, వరంగల్ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న చెట్లలో పడిపోయి ఉన్నాడు. స్థానికులు గమనించి నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడికి భార్య జయశ్రీ ఇద్దరు కుమారులు చాణిక్య, భరత్ ఉన్నారు. అయితే మృతికి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా.. శ్రీనివాస్ చెట్లల్లోకి దూసుకెళ్లి పడిపోయాడనే విషయం మాత్రం పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

వ్యవసాయ భూమి అమ్మకం

■ అదాలత్ సెంటర్ నుండి 9 కి॥మీల దూరంలో అమ్మవారిపేటలో 44 గుంటల వ్యవసాయ భూమి క్లియర్ టైటిల్, రైతు బంధు గలది. బోరు, కరెంట్ చుట్టు ఫెన్సింగ్ గలది అమ్మకం. 9948279266. [W-1229347]

PLOT FOR SALE

■ KUDA, GWMC అప్రూవ్డ్ రెసిడెన్షియల్ ప్లాట్లు చింతగట్టు క్యాంప్ వద్ద తక్కువ ధరలో అమ్మబడును. గజం: 15,000/- మాత్రమే. సంప్ర॥ సంగీత – 9866943026. [W-1229344]

■ Banjara Hills, Road No. 3, 200 Sq.yards Open Plot. (Size: 40'x45') N/F, Reg. Document. U.L.C.N.O.C. Near Kalyani Mandapam. Mr. Khaja. PH: 8639447160. [HA-1034]

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతితక్కువ వడ్డీతో అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. హన్మకొండ. సెల్: 7659010270. [WA-7261]

FOOD COURT FOR LEASE

■ హన్మకొండ చౌరస్తాకి దగ్గర్లో ఉన్న Zomato, Swiggy కలిగి ఉన్న 3 సం॥ నుండి మంచి రన్నింగ్ కండీషన్‌లో ఉన్న ఫుడ్ కోర్ట్ Lease కి ఇవ్వబడును. సంప్ర॥ 9182832959. [W-1229348]

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [H-42904]

WANTED

■ సుబేదారి నందు గల గర్ల్స్ హాస్టల్ ఫర్నీచర్‌తోని అమ్మబడును. హాస్టల్లో ఉండి వంట చేయుటకు వంట మనిషి కావలెను (లేడీస్). సంప్ర॥ 8328620934. [W-1229387]

■ శ్రీ బాలాజీ సోలార్ ఎనర్జీస్‌లో డోర్ to డోర్ మార్కెటింగ్ చేయుటకు యువతీ, యువకులు కావలెను. జీతం: 10-15K+TA+ ఇన్సెంటివ్స్ # లష్కర్‌బజార్, HNK. 9160280900, 9515954923. [W-1229499]

■ Delicious Chicken Outlets is looking for Collections Lead in Warangal. Experience in collections is mandatory. Salary:12K-15K. Cont: 8106112401. [W-788974]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ. 18 K. ఫోన్: 9640258899 / 9640468899. [H-793668]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మెసేజ్‌లు పంపిస్తూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329. [M-1167569]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-8407]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.